క్లుప్తంగా

కొడిపల్లి ఎస్‌ఐగా రంజిత్‌రెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్‌): కౌడిపల్లి ఎస్‌ఐగా రంజిత్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన శివప్రసాద్‌ రెడ్డి కరీంనగర్‌ జిల్లాకు బదిలీపై వెళ్లారు. కాగా సిద్దిపేట వన్‌టౌన్‌ ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రంజిత్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

రైతుబీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్‌): మండల పరిధిలోని ముసాపేట గ్రామానికి చెందిన కె.బాలమణి కుటుంబానికి మంజూరైన రైతుబీమా చెక్కును ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డి ఆదివారం నారాయణఖేడ్‌లో అందజేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ముసాపేట సర్పంచ్‌ అంజిరెడ్డి, మాజీ ఎంపీటీసి సాయిరెడ్డి, ప్రేమ్‌ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

కొల్చారం(నర్సాపూర్‌): టీజీ సెట్‌ – 2024, ఐదో తరగతిలో ప్రవేశం కోసం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం ప్రవేశ పరీక్షకు 480 మంది హాజరుకావాల్సి ఉండగా 362 మంది ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ప్రవేశ పరీక్ష హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ లీకేజీ

మూడు నెలలైనా పట్టించుకోని అధికారులు



వృథాగా భగీరథ నీరు

చిన్నశంకరంపేట(మెదక్‌): మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ పగిలిపోయి వాటర్‌ లీకేజీతో వృథాగా పోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. మూడు నెలల నుంచి పైప్‌లైన్‌ లీకేజీతో బురదకుంట ఏర్పడి నీరు కలుషితమైనప్పటికీ తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నశంకరంపేట బస్టాండ్‌ సమీపంలోని ఆగ్రోస్‌ కేంద్రం ఎదుట పైప్‌లైన్‌ లీకేజీతో బురదమయంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



రైతన్న వేషధారణలో విద్యార్థినులు

హవేళిఘణాపూర(మెదక్‌): మండల కేంద్రం హవేళిఘణాపూర్‌ జ్యోతిరావుపూలె బాలికల పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్‌ రజని ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులు సాగులో పడుతున్న ఇబ్బందులను కళ్లకు అద్దినట్టుగా చేసిన సాంస్కృతిక ప్రదర్శన, విద్యార్థినులు తాటి దీక్ష బృందం చేసిన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ప్రతిభకనబర్చిన విద్యార్థినులకు ప్రిన్సిపాల్‌ రజిని ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విద్యార్థినులు, బోధన సిబ్బంది ఉన్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ



పూజలు చేస్తున్న భక్తులు

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగి ఆలయ ఆవరణం అంతా కిటకిటలాడింది. ఆదివారం చిలప్‌చెడ్‌ మండలంలోని చిట్కుల్‌ శివారులో మంజీరా తీరాన వెలసిన శ్రీ చాముండేశ్వరీ అమ్మవారికి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. అనంతరం పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తులు స్నానమాచరించి అమ్మవారి దర్శనం చేసుకున్నారని, కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి ఒడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు.

అర్ధాంతరంగా నిలిచిన పనులు

- పాఠశాలలో గోడలకే పరిమితమైన మరుగుదొడ్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



అల్లాదుర్గం ప్రాథమిక పాఠశాలలో నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం

అల్లాదుర్గం(మెదక్‌): ప్రభుత్వం మారడంతో మన ఊరు – మన బడి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బిల్లులు రావనే ఉద్దేశ్యంతో కాంట్రాక్టర్‌ పనులు చేపట్టడం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. చేసిన పనులు సహితం ఇష్టరాజ్యంగా చేపట్టడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇది మండల కేంద్రం అల్లాదుర్గం ప్రాథమిక పాఠశాల దుస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్న మండల కేంద్రంలోనే అభివృద్ధి పనులు అస్తవ్యస్తంగా మారాయి.

అల్లాదుర్గం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు, కిచెన్‌షెడ్‌, ప్రహారీ నిర్మాణానికి ఎస్‌ఆర్‌ఈజీఎస్‌ కింద రూ.18 లక్షల ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌ అర్ధాంతరంగా పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కావడం, ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో బిల్లులు రావనే సాకుతో పనులు చేపట్టడం లేదు. పనులు చురుకుగా చేపట్టకపోవడంతో పాఠశాల పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు చెప్పున్నారు.

పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులు తాగడానికి నీటి సౌకర్యం లేదు. తాగునీటి కోసం విద్యార్థులు ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నేలకొంది. నీటి సౌకర్యం కోసం కాంట్రాక్టర్‌ సంపు నిర్మాణం కోసం పెద్ద తవ్వి పనులు అసంపూర్తిగా వదిలి వేయడంతో ప్రమాదకరంగా మారింది. పాఠశాలలో చిన్న పిల్లలు ఉండటంతో సంపుకు ఉన్న ఇనుప చువ్వలు తగిలి ప్రమాదం జరిగితే ఎవరిది భాధ్యత అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలకు ప్రహారీ, గేటు లేక పశువులు పాఠశాల లోపలికి వస్తున్నాయి. పాఠశాల ఒక గదికి కిటికీలు సక్రమంగా పెట్టలేదని, కిటికి తలుపులు రాక పోవడంతో చీకటిలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిధులున్న సక్రమంగా బిల్లులు రాక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదని అధికారులు సహితం నిర్లక్ష్యంగా



విద్యార్థులకు ప్రమాదకరంగా మారిన సంపు

వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైన విద్యార్థుల అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



జీడిపల్లిలో వీధులను శుభ్రం చేస్తున్న యువత

గ్రామాల్లో కొనసాగుతున్న స్వచ్ఛభారత్‌

మనోహరాబాద్‌(తూప్రాన్‌): గ్రామాల్లో స్వచ్ఛభారత్‌ కొనసాగుతోంది. ఆదివారం మండలంలోని కూచారంలో నేచర్‌ ఐకాన్‌ యూత్‌ ఆధ్వర్యంలో, జీడిపల్లిలో యూత్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్‌ చేపట్టి పలు వీధులను శుభ్రం చేశారు. కూచారంలో 301వ వారంలో భాగంగా కస్తూర్బా గాంధీ బాలికల స్కూల్‌ పాఠశాలలో శుభ్రం చేశారు. జీడిపల్లిలో మొదటి వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో 400వ వారాలుగా స్వచ్ఛభారత్‌

తూప్రాన్‌: మండలంలోని మల్కాపూర్‌ ఆదర్శ గ్రామంలో ఆదివారం 400వ వారం స్వచ్ఛభారత్‌ కార్యక్రమాన్ని ఆరో వార్డులోని దుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ



తూప్రాన్‌: మల్కాపూర్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

రోడ్డుపై ఉన్న చెత్తా చెదారాన్ని చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంజాల ఆంజనేయులు గౌడ్‌, మేకిన్‌ యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న ఆలయం ముస్తాబు



మల్లికార్జున స్వామి దేవాలయం

శివపార్వతుల కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం

వెల్దుర్తి(తూప్రాన్‌): తెలంగాణ కాశీగా పేరుగాంచిన బస్వాపూర్‌ భ్రమరాంబసహిత మల్లికార్జున స్వామి దేవాలయం(మల్లన్నగుట్ట) శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. 46వ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామస్తులు, భక్తులు కలిసి ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఆలయానికి రంగులు వేయడంతో పాటు రంగురంగుల విద్యుత్‌ దీపాలతో అందంగా అలంకరించారు. దీంతో రాత్రి సమయంలో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎందరో సిద్దులు నడయాడిన మహిమాన్విత మల్లన్నగుట్ట ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది.

దాతల సహకారంతో...

ఆలయం ప్రాంగణంలో పలువురు దాతల సహకారంతో గణపతి, వీరాంజనేయస్వామి, నవగ్రహాల ఆలయాలను, కల్యాణ మండపాన్ని, గదులు, కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. మహాశివుడికి పర్వదినమైన శివరాత్రితో పాటు శ్రావణమాసం, కార్తీకమాసం, వార్షికోత్సవాలు, ప్రతీ సోమవారం ఆలయంలోని మూలవిరాట్‌ విగ్రహాలకు విశేషాలంకరణలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. అలాగే ప్రతీ సోమవారం దాతల సహకారంతో ఆలయ కమిటీ అన్నదానం నిర్వహించనున్నారు.



ఆలయం ఎదుట కోనేరు

చికిత్స పొందుతూ మహిళ మృతి

నిజాంపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని కల్వకుంట గ్రామానికి కొమ్మల సువర్ణ(56) కొన్ని రోజుల నుంచి పక్షవాతంతో బాధపడుతుంది. ఈ మేరకు 2 రోజుల క్రితం ఆమె పూజ గదిలో ప్రమాదవశాత్తు మంటలు తన చీరకు అంటుకున్నాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స జరుగుతుండగా బుధవారం రాత్రి మృతి చెందిన్నట్లు కుటుంబీకులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనర్సింహస్వామి జాతర



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని ముట్రాజ్‌పల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి జాతర భక్తిశ్రద్ధలతో జరుగుతోంది. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు స్వామివారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌ ఎమ్మెల్యే సునీతారెడ్డి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. సంజీవ్‌, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య హాస్టల్‌ కార్యవర్గ సభ్యుడిగా నారాయణగుప్తా



నియామక పత్రాన్ని అందుకుంటున్న నారాయణగుప్తా

తూప్రాన్‌: హైదరాబాద్‌ ముషీరాబాద్‌లోని వాసవీ ఆర్యవైశ్య హాస్టల్‌ కార్యవర్గ సభ్యుడిగా(ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌గా) తూప్రాన్‌కు చెందిన 16వ వార్డు కౌన్సిలర్‌, రాష్ట్ర ఐవీఎఫ్‌ కోశాధికారి కోడిప్యాక నారాయణగుప్తా నియామకమయ్యారు. ఆదివారం రమేశ్‌, రాజమౌళి గుప్తా నియామక పత్రం అందజేశారు. మాజీ ఎంపీటీసీ వెంకటేశ్‌, ఎమ్మెల్సీ దయానంద గుప్తా, మాజీ టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌ గుప్తా, మాజీ సీఎం రోశయ్య కుమారుడు శివకుమార్‌, ప్రముఖ పారిశ్రామికవేత్త బండారు సుబ్బారావు, రమేశ్‌ గుప్తా వాసవీ ఆర్యవైశ్య హాస్టల్‌ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాసవీమాతకు సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

పెద్దశంకరంపేట(మెదక్‌): వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆర్యవైశ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ లక్ష్మీరమేశ్‌, మండల మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు రాగం అర్చన, ప్రధాన కార్యదర్శి చకిలం విశాల తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్‌): మండల కేంద్రం చేగుంటలో కన్యకపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వాసవీ మాత ఆత్మార్పణ రోజు సందర్భంగా భక్తులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, కుంకుమార్చన



చేగుంట కన్యకా పరమేశ్వరీ ఆలయంలో సామూహిక కుంకుమార్చన చేస్తున్న భక్తులు

చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటలక్ష్మి, గణేశ్‌, నాగభూషణం, రాజేశ్వర్‌, పరంజ్యోతి, పాండు, శేఖర్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీరప్ప విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

టేక్మాల్‌(మెదక్‌): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో బీరప్పస్వామి – కామరాతి, అక్క మహంకాళి స్థిర విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కురుమ సంఘం సభ్యులు ఆదివారం తెలిపారు. ఈనెల 12న మహాగణపతి పూజ, యాగమంటప ప్రవేశం, పుణ్యావచనము, దీక్షాధారణ ధ్వజారోహణం, నవగ్రహ క్షేత్ర పాలక మంటపదేవత ఆవాహనం, కలశ స్థాపన, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 13న రుద్ర ఆహ్వానం, మూలమంత్ర హవనం, శాంతి పాఠం, రుద్ర ఆహ్వానం, మంగళ హరతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈనెల 14న యంత్ర, మూర్తి, ప్రాణ ప్రతిష్ఠ, కలన్యాసము, పూర్ణాహుతితో పాటు



ముస్తాబైన బీరప్ప దేవాలయం

అన్నదానం ఉంటుందన్నారు. 15న బీరప్ప స్వామికి బోనాలు, 16న బొంబుగొండ విగ్రహానికి బోనాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

విజేతలకు మైనంపల్లి రోహిత్‌ ట్రోఫీ అందజేత

మెదక్‌: మెదక్‌ జిల్లా స్పోర్ట్స్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీనియర్‌ క్రికెటర్స్‌ ప్రిమియర్‌–4 అజంపురా టీం విజేతగా నిలిచింది. ఇందులో మొత్తం 10 జట్లు పాల్గొనగా విజేతగా ఎంపికైన జట్టుకు ఎమ్మెల్యే రోహిత్‌ ట్రోఫీ అందజేశారు. కొండ శ్రీనివాస్‌ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నీలో 40 ఏళ్లకు పైబడిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బెస్ట్‌ బ్యాట్స్‌ మన్‌గా (సాంసన్‌ సందీప్‌) బాని, బెస్ట్‌ బౌలర్‌గా ఖాదర్‌ అలీ, బెస్ట్‌ ఫీల్డర్‌గా నరేశ్‌, మ్యాన్‌ ఆఫ్‌ ది సిరీస్‌గా బాని కప్‌ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రపాల్‌, వ్యవస్థాపకులు శివశంకర్‌ రావు, అధ్యక్షులు జుబేర్‌, టీఎన్‌జీవో అధ్యక్షుడు నరేందర్‌, కోశాధికారి శేఖర్‌, జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి అధికారి నాగరాజు, కొండ శ్రీనివాస్‌ కుటుంబ సభ్యులు, ఫౌండేషన్‌ సభ్యులు శ్రీనివాస్‌, సలీం, ఓమర్‌, పీడీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆదివారం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితులు శివప్ప, రాజేశ్‌ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం పోశారు. తలనీలాలు సమర్పించారు. వాహనాలకు పూజలు చేయించారు. ఆలయంవద్ద డప్పు చప్పుడు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీ నెలకొంది. ఆలయ అధికారులు ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా తునికి నల్లపోచమ్మను నర్సాపూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌ గౌడ్‌ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



నల్లపోచమ్మకు పూజలు చేస్తున్న నర్సాపూర్‌ మున్సిపల్‌ చైర్మన్‌ అశోక్‌గౌడ్‌

క్రీడల్లో గెలుపు, ఓటములు సమానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్‌): క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావించాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం చేగుంటలో సీసీఎల్‌ మండల స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడిన వారు మరోసారి విజయం కోసం ప్రయత్నం ప్రారంభించాలని సూచించారు. క్రీడలతో యువతలో ఐకమత్యంగా ఉండాలన్నారు. అనంతరం విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్‌, రాజిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ దుండగులకు జీవిత ఖైదు విధించాలి

కొల్చారం(నర్సాపూర్‌): కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో దళిత మహిళను వివస్త్రను చేసిన దుండగులకు జీవిత ఖైదు విధించాలని ఎమ్మార్పీఎస్‌ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడో ఓ చోట దళితులను అవమానించడం, అత్యాచారాలు, దాడులు జరుగుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఎన్ని చట్టాలు ఉన్న పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం, దుండగులను శిక్షించడంలో ఆలస్యం, దళితులపై దాడులకు కారణంగా మారాయన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను మరింత కఠిన తరం చేసి దుండగులు ఎప్పటికీ జైల్లోనే ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

◆ దరఖాస్తుల స్వీకరణ



పెద్దశంకరంపేట(మెదక్‌): పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్‌ విఠల్‌నాయక్‌ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 వరకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని, వీరికి ఏప్రిల్‌ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

◆ సన్మానం

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని కొట్టాల మాజీ సర్పంచ్‌ నరహరిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఆదివారం గ్రామస్తులు, నాయకులు సర్పంచ్‌, పంచాయతీ కార్యదర్శి మల్లేశంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్‌గౌడ్‌, కిషన్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

◆ బాధిత కుటుంబానికి చేయూత



మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోటి కార్మికుడి కుటుంబానికి అండగా ఉండటానికి మిగతా పంచాయతీ కార్మికులు నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. మనోహరాబాద్‌ మండల కేంద్రానికి చెందిన రమేశ్‌ వారం రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. కాగా అతని కుటుంబానికి అండగా ఉండటానికి 17 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులందరూ కలిసి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి ఆసిఫ్‌, కార్మికులు సత్తయ్య, అర్జున్‌, భిక్షపతి, దావీద్‌, శోభ, ఎల్లమ్మ, నవనీత, యాదమ్మ పాల్గొన్నారు.

◆ శివ్వంపేట ఎంపీడీఓ బదిలీ

శివ్వంపేట(నర్సాపూర్‌): మండల కేంద్రం శివ్వంపేట ఎంపీడీఓ భారతి బదిలీ అయ్యారు. ఈమెను సంగారెడ్డికి బదిలీ చేస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

◆ ఎంపీడీఓ బదిలీ

చిన్నశంకరంపేట(మెదక్‌): మండల కేంద్రం చిన్నశంకరంపేట ఎంపీడీఓ ప్రవీణ్‌ బదిలీ అయ్యారు. అలాగే నార్సింగి ఎంపీడీఓ ఆనందమేరి సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

◆ సిటిజన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా యాదగిరి

గజ్వేల్‌: గజ్వేల్‌ సిటిజన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు నాయిని యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలక మండలి ఎన్నిక కోసం ఆదివారం నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు ఇతర కమిటీ బాధ్యులకు ఒక్కో నామినేషన్‌ మాత్రమే దాఖలయ్యాయి. నాయిని యాదగిరి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అమర నాగేందర్‌ ప్రకటించారు. కమిటీకి ఉపాధ్యక్షుడిగా నల్ల సీతారామమూర్తి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా దుంబాల భూపాల్‌రెడ్డి, కోశాధికారిగా సుదగారి మల్లయ్యగౌడ్‌, క్రీడా కార్యదర్శిగా గంగాల నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి సహాయ ఎన్నికల అధికారులుగా అర్సం శ్రీనివాస్‌, పోగుల రమేష్‌ వ్యవహరించారు.